క్లుప్తంగా

ప్రతి రైతూ ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలి



అయ్యవారుపల్లిలో పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ స్వాతి

గుంతకల్లు రూరల్: రబీలో భాగంగా బుధవారం ఈక్రాప్ బుకింగ్ ప్రారంభమైన నేపథ్యంలో పంట సాగు చేసిన ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలని ఏఓ కే.స్వాతి సూచించారు. బుధవారం ఏఓ మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటించి ఈక్రాప్ బుకింగ్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఏటా 5500 ఎకరాల్లో రబీ పంటలు సాగవుతాయన్నారు. రైతులు తమ పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలతో సంబంధిత ఆర్బీకే సిబ్బందిని సంప్రదించి పంట నమోదు చేయించుకోవాలని సూచించారు.

తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్ తనిఖీ

కణేకల్లు: మండలంలోని వివిధ గ్రామాల్లో రైతుల నుంచి వరిధాన్యం కొనుగోలు చేస్తున్న ప్రాంతాల్లో గుంతకల్లు డివిజన్ తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్ శంకర్ గురువారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. మాల్యం, కణేకల్లు, గంగలాపురం తదితర గ్రామాల్లోని వరికల్లాల్లో వరిధాన్యం కొనుగోలు చేస్తున్న ప్రాంతాలకెళ్లి కాటాలను పరిశీలించారు. మాల్యం గ్రామశివారులో తూకాలు వేసే రాళ్లకు సీల్ వేయించుకోకుండా వినియోగిస్తుండటంతో వ్యాపారికి రూ.3 వేలు జరిమానా విధించారు. అలాగే ఓ రైస్‌మిల్లు నుంచి బియ్యం లోడ్‌తో వస్తున్న ఆటోను ఆపి తూకం వేయగా 48 కిలోలు మాత్రమే ఉండటంతో సదరు వ్యాపారికి రూ.40 వేలు జరిమానా విధించారు. కాగా తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్ దాడులు నిర్వహిస్తున్నట్లు తెలుసుకున్న వ్యాపారులు తమ వ్యాపారులకు బ్రేక్ వేశారు. ఆయన ఈ ప్రాంతంలో ఉన్నంత సేపు ఎక్కడ కొనుగోళ్లు చేయలేదు.

ఘనంగా ఆంజనేయస్వామి మాలధారణ



స్వామిని దర్శించుకుంటున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ

గుత్తి: పట్టణంలోని చెరువు కట్ట ఆంజనేయ స్వామి ఆలయంలో గురువారం ఆంజనేయ స్వామి మాలధారణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందరంగా ఆలయ అర్చకులు ప్రకాష్‌స్వామి భక్తులకు మాలధారణ గావించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్‌బీ ఆంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.

ఘనంగా గంగామాత ఉత్సవం



పూజల్లో పాల్గొన్న ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ వీరా

పామిడి: స్థానిక బెస్తవీధిలోని గంగామాత ఆలయంలో గురువారం బెస్తకులస్తుల ఆధ్వర్యంలో గంగామాత ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గంగామాత విగ్రహాన్ని శోభాయానంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఎం వీరాంజనేయులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం భక్తాదులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

రోడ్డు నిబంధనలపై అవగాహన



ఆటో,టాక్సీ డ్రైవర్లతో మాట్లాడుతున్న ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి

యాడికి: స్థానిక చెన్నకేశవాలయం వద్ద గురువారం ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనం నడిపేటప్పుడు డెక్కులతో ఎక్కువ సౌండ్ పెట్టుకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ సర్టిఫికెట్లు ఉండాలన్నారు. ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాలతో గ్రామస్వరాజ్యం

• ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

బుక్కరాయసముద్రం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గ్రామ/వార్డు సచివాలయాలతో గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యం తీసుకొచ్చారని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. గురువారం మండలంలోని చెన్నంపల్లి గ్రామంలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థను ప్రవేశ పెట్టారన్నారు. వాటిలో ఉద్యోగులు నియమించి ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేశారన్నారు. గ్రామాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కరించేలా సచివాలయాలు పని చేస్తున్నాయన్నారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరిగే అవసరం లేకుండానే స్థానికంగానే సచివాలయాల్లో పనులు జరిగేలా చర్యలు చేపడుతున్నారన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాలు అందించడంతోపాటు రైతుల పంటలను మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ సభ్యుడు భాస్కర్, సొసైటీ అధ్యక్షుడు వెంకటరెడ్డి, మాజీ ఎంపీపీ గువ్వల రాజశేఖర్‌రెడ్డి, నాయకులు గువ్వల నారాయణరెడ్డి, గువ్వల రామ్మోహన్‌రెడ్డి, ఉప సర్పంచ్ గువ్వల మనోహర్‌రెడ్డి, ఎంపీటీసీ నాగయ్య, చైతన్య మండల సమాఖ్య అధ్యక్షురాలు సుహాసిని, కొండమ్మ, ముత్యాలశీన గువ్వల అమర్‌నాథ్‌రెడ్డి, శ్రీరాములు, గోవింద్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, విగ్ర ప్రతిష్టల్లో పాల్గొని వేద ఆశీర్వాదం అందుకుంటున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

శాస్త్రోక్తంగా నాగదేవతల ప్రతిష్ఠ

అనంతపురం కల్చరల్: శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ సలహాదారు (విద్య) ఆలూరు సాంబశివారెడ్డి ప్రత్యేకంగా తయారు చేయించిన విగ్రహాలకు గురువారం శాస్త్రోక్తంగా ప్రాణ ప్రతిష్ఠలు జరిగాయి. నగరంలోని సోమనాథ్ నగర్ కోదండరామాలయంలో రెండు రోజుల పాటు ఘనంగా సాగిన విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు పూర్ణాహుతితో ఘనంగా ముగిశాయి. వేద పండితులు హరికృష్ణశర్మ, ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల కృష్ణమూర్తి, స్వామి మణూరు నాగరాజు ఆధ్వర్యంలో ఉదయం వేదమంత్రాల, మంగళవాయిద్యాల నడుమ నూతనంగా ఆలయంలో ఏర్పాటు చేసిన వేదస్తూపం, నాగ దేవతల విగ్రహాలు ప్రతిష్ఠలతో పూజలందుకున్నాయి. విరూపాక్ష దత్తపీఠం పీఠాధిపతులు విద్యానృసింహ భారతి తారకరామ హోమం, గాయత్రి హోమం, నాగహోమాల్లో పాల్గొని ప్రతిష్ఠల విశిష్టతను తెలియజేశారు. కార్యక్రమంలో వివిధ ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులు నాగభూషణం, విజయసాయి, ప్రకాశరావు, ప్రసాద్, ఉమారాణి, రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా విద్యుత్ స్తంభాల ఏర్పాటు

గుత్తి: మున్సిపాలిటీపరిధిలో విద్యుత్ స్తంభాల ఏర్పాటు ముమ్మరంగా సాగుతోంది. పట్టణంలో చాలాచోట్ల విద్యుత్‌స్తంభాలు శిథిలావస్థకు చేరుకోవడంతో వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి విద్యుత్ అధికారులను ఆదేశించారు. దీంతో మూడు రోజులుగా ట్రాన్స్‌కో డీఈ రాజశేఖర్ ఆధ్వర్యంలో సిబ్బంది విద్యుత్‌స్తంభాల ఏర్పాటులో నిమగ్నమయ్యారు. పట్టణంలోని 11, 12,13,14,15 వార్డుల్లో దాదాపు 80 దాకా స్తంభాలు ఏర్పాటు చేసినట్లు డీఈ రాజశేఖర్, ఏఈ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, పట్టణ కన్వీనర్ పీరా, కౌన్సిలర్లు ఫరూక్, మర్తాడు హసీనా, నజీర్, కృపా సుజాత, అంజల, వార్డు ఇన్‌చార్జ్‌లు సునీల్, హమాలి రామాంజి, అరటి పండ్ల చంద్ర, బింగి బాబు, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.



11వ వార్డులో విద్యుత్ స్తంభం ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

గార్లదిన్నె: తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం దివ్యాంగుల హక్కుల పోరాట సమితి, అరుణోదయ మండల సమాఖ్య ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా దివ్యాంగులు బస్టాండ్ సర్కిల్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం వరకు వెళ్లి అక్కడ సమావేశం ఏర్పాటు చేశారు. ఆర్డీటీ ఎస్టీఎల్ ఇంద్ర ప్రసన్న దివ్యాంగుల హక్కులు, చట్టాలపై వివరించారు. అరుణోదయ మండల సమాఖ్య అధ్యక్షురాలు యల్లమ్మ, వెలుగు సీసీ రామాంజనేయులు, నాగమణి, ఓబిలేసు, దివ్యాంగుల హక్కుల పోరాట సమితి కళా మండలి అధ్యక్షుడు పుల్లన్న, గాదిలింగప్ప, బసమ్మ, దివ్యాంగులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్టీఎల్ ఇంద్ర ప్రసన్న

తామర పురుగు నివారణపై దృష్టి పెట్టాలి

పెద్దవడుగూరు: జిల్లా లో మిరప సాగు చేసిన రైతులు తామర పురుగు నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా ఉద్యాన సహాయ సంచాలకులు నరసింహరావు పేర్కొన్నారు. గురువారం ఆయన మిడుతూరు, పెద్దవడుగూరు, లక్ష్మంపల్లి, మేడిమాకులపల్లిలోని మిరప పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. మిరప రైతులు పంటను తొలగించకుండా సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. తామర పురుగు గుడ్లు పెట్టిన సమయంలో వేప నూనెతో పిచికారీ చేయడం వలన పిల్ల పురుగులు వృద్ధి చెందవన్నారు. సామూహికంగా నీలి, పసుపు రంగు అట్టలను ఎకరానికి 25 నుంచి 30 ఏర్పాటు చేయాలని సూచించారు. పురుగు ఉధృతి అధికంగా ఉన్నప్పుడు ఫిప్రోనిల్ 40–50 గ్రాములు, ఎసిటామిప్రిడ్ 4–50 గ్రాములు పిచికారీ చేసుకోవాలన్నారు. తెల్ల దోమ నివారణ చర్యలను వివరించారు. హార్టీకల్చర్ అధికారిణి మిత్ర, సిబ్బంది పాల్గొన్నారు.



మేడిమాకులపల్లి వద్ద మిరపతోటను పరిశీలిస్తున్న ఏడీ నరసింహరావు

ఆకట్టుకున్న కళారూపాల ప్రదర్శన

అనంతపురం కల్చరల్: జిల్లా కేంద్రంలో కొలువైన ఏకైక మహాలక్ష్మి ఆలయ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించిన అనంతరం నగరవీధుల్లో శోభాయాత్ర నేత్రానందంగా సాగింది. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన పలు దేవతామూర్తుల వేషధారులు, ప్రాచీన కళారూపాలైన కోలాటం, చెక్కభజన, మరగాళ్లు, కోయదొరలు, గురవయ్యలు తమదైన ప్రతిభావిశేషాలతో పురాణ ఘట్టాలను గుర్తు చేస్తూ శోభాయాత్రలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తజన సందోహం అడుగడుగునా మంగళ హారతులు పట్టి అమ్మవారికి నీరాజనాల్పించారు.



నగరవీధుల్లో మహాలక్ష్మమ్మ అమ్మవారి ఊరేగింపులో కళా ప్రదర్శనలు

నేడు 'ప్రజా వేదిక'

గుంతకల్లు రూరల్: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఉదయం 10 గంటలకు సామాజిక తనిఖీపై ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణప్ప గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గతేడాది జనవరి నుంచి ఈ ఏడాది 2023 మార్చి వరకూ మండలంలో ఉపాధిహామీ పథకం కింద నిర్వహించిన పనులపై సిబ్బంది క్షేత్ర స్థాయిలో సామాజిక తనిఖీలు నిర్వహించారని పేర్కొన్నారు. సామాజిక తనిఖీల్లో సేకరించిన పూర్తీ వివరాలను సభలో సభ్యులు తెలియజేస్తారన్నారు.

రేపు 'ప్రజావేదిక'

తాడిపత్రిటౌన్: ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రంగరావు తెలిపారు. కార్యక్రమానికి ఆయా శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

పలువురికి అస్వస్థత

పామిడి: పట్టణంలోని బెస్తవీధి, షాదీఖానా తదితర వీధుల్లో గురువారం పలువురు అస్వస్థతకు గురయ్యారు. ఆయా కాలనీలకు సంబంధించి 15 మంది వాంతులు, విరేచనాలు కావడంతో స్థానిక ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రాథమిక చికిత్స పొందారు. తర్వాత అనంతపురం ప్రభుత్వాస్పత్రికి వెళ్లారు. కలుషిత నీటి కారణంగానే అస్వస్థతకు గురైనట్లు బాధితులు తెలిపారు.

కనుల పండువగా అయ్యప్ప గ్రామోత్సవం

అనంతపురం కల్చరల్: నగరంలోని చెరువుకట్ట అయ్యప్ప స్వామి దేవాలయ గ్రామోత్సవం కనుల పండువగా సాగింది. ఐదురోజుల పాటు సాగే స్వామివారి ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేక పూజల అనంతరం ఆలయ కమిటీ అధ్యక్షుడు మణికంఠ గౌతం ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి ఆలయం నుండి పాతూరు మార్కెట్, తిలక్ రోడ్డు, సప్తగిరి సర్కిల్, టవర్‌క్లాక్, ఆర్‌ఎఫ్‌రోడ్డు మీదుగా ఆలయం చేరుకున్న గ్రామోత్సవంలో అధిక సంఖ్యలో మాలధారులు నగరవీధుల్లో ఆనంద తాండవం చేశారు. భక్తిగీతాలతో, అయ్యప్ప శరణు ఘోషతో పరిసరాలను మార్మోగించారు. శుక్రవారం అగ్నిగుండ ప్రవేశం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.



అయ్యప్ప స్వామి గ్రామోత్సవం

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



తాడిపత్రి మండలం గన్నెవారిపల్లి కాలనీలో కిట్లు పంపిణీ చేస్తున్న నాయకులు



బీకేఎస్ మండలం రేకులకుంటలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్: పేదల సంక్షేమంగా లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ ఓబుళరెడ్డి అన్నారు. గన్నెవారిపల్లి కాలనీలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును అవిష్కరించారు. అనంతరం ఎంపీటీసీ రవికుమార్ గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు. మరోసారి వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి జగనన్నను ముఖ్యమంత్రిగా కొనసాగించుకుందామని గ్రామస్తులకు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పల్లె నాగేశ్వరెడ్డి, నాయకులు ప్రదీప్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: రేకులకుంట గ్రామ సచివాలయంలో గురువారం సర్పంచ్ నరసమ్మ ఆధ్వర్యంలో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ భాస్కర్ మాట్లాడుతూ జగనన్న సారథ్యంలోనే పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. రేకులకుంట సచివాలయం పరిధిలోని ప్రజలకు రూ.21.98 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. జేసీఎస్ మండల కన్వీనర్ బయపరెడ్డి, నాయకులు సాకే నారాయణస్వామి, సాకే లక్ష్మి నారాయణ, రంగా చెదుల్ల సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

బుక్కరాయసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం బాలికల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతోందని కేజీబీవీ ప్రిన్సిపాల్ నాగవేణి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని కేజీబీవీలో సంధ్యా గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బాలికల కోసం ప్రభుత్వ అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఎక్కడైనా బాలికల బాల్య వివాహాలు జరుగుతునా..వారిపై దాడులు జరుగుతున్నా వెంటనే పోలీసులు, డయల్ 100కు, చైల్డ్‌లైన్ 1098కు సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం బాలికల సంరక్షణపై ప్రతిజ్ఞ చేసి ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకురాలు మనేరి కొండమ్మ, మహిళా పోలీసు కార్యదర్శి చంద్రకళ, గాయత్రి, వీఓఏ రాజేశ్వరి, ఐకేపీ సీసీ శంకర్, చంద్రకళ విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

జగనన్నను మరోసారి సీఎం చేసుకుందాం

తాడిపత్రిటౌన్: వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి జగనన్నను మరోసారి గెలిపించుకుందామని ఎమ్మెల్యే తనయుడు, వైఎస్సార్‌సీపీ యువనేత కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి ప్రజలను కోరారు. మండలంలోని కొనగుంటపల్లిలో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. గ్రామ సమస్యలపై ప్రజలతో అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి జగనన్న ముఖ్యమంత్రిగా కొనసాగాలన్నారు. చంద్రబాబు హయాంలో సంక్షేమ పథకాల కోసం పడిన ఇబ్బందులను గుర్తు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటరామిరెడ్డి, ఎంపీటీసీ శేఖర్‌నాయుడు, మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ ఓబుళరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పల్లె నాగేశ్వరెడ్డి, నాయకులు పాపిరెడ్డి, రామ్మోహన్ రెడ్డి, రాజకుళ్లాయప్ప, వాసుదేవరెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న యువనేత సాయి ప్రతాప్‌రెడ్డి

ఆనందరావుపేటలో నీటి సమస్య పరిష్కారం

శింగనమల: ఆనందరావుపేటలో నీటి సమస్య పరిష్కారమైంది. గత నెల 26న ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి గ్రామానికి రాగా గ్రామస్తులు నీటి సమస్యతోపాటు డ్రైనేజీ సమస్యను ఆయన దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆలూరు సాంబశివారెడ్డి రూ.23 లక్షల నిధులు మంజూరు చేయించారు. గురువారం ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ గంగన్న, వైఎస్సార్‌సీపీ నేత రామాంజనేయులు కొత్త మోటారు ఏర్పాటు చేయించి నీటి సమస్య తీర్చారు. త్వరలో గ్రామంలో డ్రైనేజీ నిర్మాణాలను చేపడతామని జేఈ తెలిపారు.



కొత్త మోటారు ఏర్పాటు చేయిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీనివాసులు

కుల గణన సర్వే పారదర్శకంగా చేయండి

యల్లనూరు: కుల గణన సర్వే పారదర్శకంగా చేపట్టాలని తహసీల్దారు సుమతి, ఎంపీడీఓ వీరరాజు ఆదేశించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో సమావేశమయ్యారు. మండల వ్యాప్తంగా 9 నుంచి కులగణన సర్వే ప్రారంభవుతుందన్నారు. వారం రోజుల సమయంలో ఇంటింటికీ వెళ్లి సర్వే చేయాలన్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వరాదన్నారు. ఎక్కడైనా తప్పిదాలు జరిగితే ఆయా వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులదే బాధ్యతన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి

గుంతకల్లు: అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ గుంతకల్లు డివిజన్ కమిటీ కార్యదర్శి బి.సురేష్ ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన సత్యాగ్రహ నిరాహార దీక్షకు ఆయన మద్దతు తెలిపారు. టీపీడీఆర్ జిల్లా సభ్యులు రఘునాథ్‌రెడ్డి, ఐఎఫ్‌టీయూ పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, నాయకులు బాషా, జానయ్య, గోపి పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా' పోటీలకు పేర్లు నమోదు చేసుకోండి

యల్లనూరు: ఆడుదాం ఆంధ్రా పోటీలకు ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఆయా గ్రామ సచివాలయాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని గురువారం ఎంపీడీఓ వీరరాజు సూచించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలు ఉంటాయని అన్నారు. 15 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ పోటీలకు అర్హులన్నారు. ఈనెల 13న రిజిస్ట్రేషన్ గడువు ముగుస్తుందని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పామిడి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆడుదాం..ఆంధ్రా కార్యక్రమ సర్వేను శుక్రవారం కంతా పూర్తి చేయాలని ఎంపీడీఓ డీ ప్రభాకర్‌నాయక్ సిబ్బందిని కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వలంటీర్ల తమకు కేటాయించిన 50 ఇళ్లలో మహిళా క్రీడాకారులను గుర్తించాలి, ఇంటికి ఒక క్రీడాకారిణితో పాటు వారి ఆటను వీక్షించడానికి ఇంటికి ముగ్గురు చొప్పున పేర్లను నమోదు చేయించాలన్నారు. మహిళల్లో దాగి ఉన్న క్రీడానైపుణ్యాలను వెలికి తీయడానికే ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు.

రక్తదానంతో ప్రాణదాతలు కండి



రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేసిన దృశ్యం

గుంతకల్లు: రక్తదానంతో ప్రాణదాతలు కావాలని జేవీవీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ హరిప్రసాద్ యాదవ్ పేర్కొన్నారు. స్థానిక గోపీ చారిటబుల్ ట్రస్ట్ బ్లడ్ బ్యాంకులో గురువారం నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్‌ఏసీ)కు చెందిన 20 మంది విద్యార్థులు రక్తదానం చేసి ఔదార్యాన్ని చాటుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత రక్త సహాయ బృందాలుగా ఏర్పాడి బ్లడ్ బ్యాంకుల్లో రక్తం కొరత లేకుండా చూడాలని కోరారు. సకాలంలో రక్తం దొరకక చాలామంది ఇబ్బందులు గురవుతున్నారని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతతో రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్‌ఏసీ ట్రైనింగ్ ఇంచార్జ్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉమాదేవికి ఘన నివాళి



గుంతకల్లు చర్చిలో ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

గుంతకల్లు: స్థానిక మస్తాన్‌పేటలోని చర్చిలో యూసీడబ్ల్యూఎఫ్ సేవకుల ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి సతీమణి ఉమాదేవి మృతికి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా యూసీడబ్ల్యూఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ గ్యాబ్రిల్, ప్రధాన కార్యదర్శి కేఎన్‌జీ పాల్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి బాబన్న, నాయకులు ఆంథోని ఆధ్వర్యంలో ఆమె ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబ సభ్యులకు ధైర్యం ఇవ్వాలని ప్రార్థనలు చేశారు. సర్పంచుల ఫోరం సంఘం మాజీ అధ్యక్షుడు లోకిరెడ్డి, కౌన్సిలర్ సుధాకర్, లాయర్ భాస్కర్‌గౌడ్ తదితరులు ఆమె మృతిపట్ల సంతాపం తెలిపారు.

పామిడి: ఎమ్మెల్సీ వై శివరామిరెడ్డి సతీమణి ఉమాదేవి మృతిపై గురువారం జడ్పీటీసీ శోభారాణి, ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ, రూరల్ కన్వీనర్లు జోజోడే కుమార్, కే నారాయణరెడ్డి, ఎం కుమార్‌రెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూదన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్కలూరు దిలీప్‌రెడ్డి తదితరులు సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని కోరారు.

పంటనష్ట పరిహారం అందించాలి

తాడిపత్రిటౌన్: ఖరీఫ్‌లో పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని ఏపీ రైతు సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం సీఎస్‌డీటీ రాజారాంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, మండల కార్యదర్శి రాజరామిరెడ్డి, అధ్యక్షుడు సూర్యనారాయణరెడ్డి, జిల్లా కమిటీ సభ్యురాలు శిరీష తదితరులు పాల్గొన్నారు.

వాహనాల పట్టివేత

యాడికి: అధిక లోడుతో వెళ్తున్న 3 వాహనాలను పట్టుకున్నట్లు ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి గురువారం తెలిపారు. పట్టుబడిన వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామన్నారు.